# కామేశం - శిష్యుల సన్మానం

అర్ధరాత్రి దాటడానికి రెండునిమిషాలుంది.

నిర్మానుష్యమైన బైపాస్ రోడ్డుమీద నిర్దాక్షిణ్యంగా కామేశాన్ని వదిలేసి, చక్కా పోయింది హైటెక్‌బస్.

లగేజితో రోడ్డుదాటి తమ పట్టణంలోకి వెళ్లే మార్గంవైపు కదిలాడు కామేశం.

మంకీక్యాప్, ఒంటి చుట్టూ కప్పుకున్న శాలువాతో చిన్నసైజు డైనోసార్ ఆకారంతో మీదకు వస్తున్న అతన్ని చూసి చలికి ముడుచుకున్న ముసలికుక్క ఒకటి మొరగబోయి మానుకుంది.

అసలే కుక్కలంటే భయపడే కామేశం అంత ఘోర చలిలోనూ గబగబా మంకీక్యాప్, కప్పు



కొత్తపల్లి ఉదయ్‌బాబు

కున్న శాలువా తీసేసి, చేతిలో ఉన్న బ్యాగ్‌లో కుక్కేసి తానూ ప్రస్తుత సమాజంలో హుందాగా వ్యవహరిస్తున్న వ్యక్తిలా నిలబడ్డాడు.

అతని నిజస్వరూపం చూసిన కుక్క మళ్లీ మొరగబోయి, కరెంటుషాక్ కొట్టిన గేదెలా అతను చలికి వణకడం చూసి, తననేదో చేయబోతున్నాడు అనుకుని అక్కడ నుంచి దూరంగా నిర్మానుష్యంగా ఉన్న బస్‌స్టాప్ షెల్టర్‌లోకి పారిపోయి, సుఖంగా పడుకుంది.

అమ్మయ్య! అనుకుంటూ చదువుతున్న ఆంజనేయ దండకం ఆపాడు కామేశం.

అంతలోనే అతనికి అనుమానం వచ్చింది.

ఆంజనేయ దండకం సగమే పూర్తిచేసి ఆపేస్తే స్వామికి కోపం వచ్చి మరలా ఆ ముసలి శునకరాజాన్ని ప్రేరేపిస్తాడేమో అనుకుని, "స్వామీ! తొందరగా ఓ ఆటోనో, లారీనో వచ్చి నన్ను వూరిలో మెయిన్‌రోడ్డు మీద పడేలా చేయవయ్యా! రేపు మంగళవారమే నీకు అష్టోత్తరం చేయిస్తాను" అని ముందుగా మొక్కుకుని, ఆంజనేయ దండకాన్ని పూర్తిచేసాడు కామేశం.

కరుణామయుడైన ఆ స్వామి కృప వల్ల వెంటనే ఓ లారీ వచ్చి ఆగింది అతని ముందు.

"ఏం సార్! ఎక్కడిదాకా?" అడిగాడు డ్రైవర్ స్థానంలో ఉన్న వ్యక్తి.

"ఓవర్ బ్రిడ్జి దాటి అవతలకు వెళ్తుందా?" అడిగాడు కామేశం.

"అవతలకు ఎల్లదుగానీ... రండి! బ్రిడ్జి మీద దింపేత్తాను" అన్నాడు అతను.

బ్రతుకు జీవుడా అనుకుంటూ... సుఖ నిద్రలో ఉన్న ముసలి కుక్క మీదపడి కండ పీకేస్తుందేమో అన్నంత వేగంగా తన మూడు పాతికకేజీల శరీరాన్ని లారీ కేబిన్‌లో కుదేసాడు కామేశం.

డ్రైవర్ వెనుకే పొడుగాటి బెంచీ లాంటి దానిమీద విక్రమార్కుడి ఫ్రెష్ శవంలా నిద్రపోతున్న శాల్తీ కాళ్ల మీద కామేశం పడటంతో ఆ శాల్తీ ఓసారి కప్పుకున్న తెల్లదుప్పటి తీసి, కోప్పడిపోయి విప్పార్చిన నేత్రాలతో కామేశాన్ని మరోసారి పైనుంచి కింద దాకా పరిశీలించి తిరిగి శవాకారం దాల్చాడు.

"క్లీనర్‌నాకొడుకండి. మీవూరే. నిద్రకాగ లేదు... ఎదవ సచ్చినాడు" అన్నాడు డ్రైవర్!

"అలాగా!" అన్నాడు కామేశం ఏమనాలో తెలీక!

"అదిసరేగాని ఏడనుంచొత్తన్నారండీ?" అడిగాడు డ్రైవర్.

"గుంటూరు నుంచి"

"ఏం పనిమీద ఎల్లారు సారు?"

"నేను ఓ చిన్న కవినిలే!" అన్నాడు కామేశం.

కామేశం వైపు తిరిగి పకపకా భళ్లున సీసా పగిలిన శబ్దంతో నవ్వాడు వాడు.

కామేశం మళ్లీ ఆంజనేయ దండకం అందుకున్నాడు – ఘుప్పుమని ముక్కుకు తగిలిన వాసనతో. కల్లువాసన పడదు కామేశానికి.

"అంటే సినిమా పాటలు గానీ రాత్తారా బాబూ!"

"అవి రాయను గానీ కవిత్వం రాస్తాను"

"ఎందుకొచ్చిన కవిత్వం గానీ 'యిప్పటికింకా నా వయసు – నిండా పదహారే..., అ... అంటే అమలాపురం...' అట్టాంటి పాటలు రాయండి బాబూ! డబ్బుకి డబ్బు; పేరుకు పేరు..." అన్నాడు వాడు.

"నాకు అలాంటి పాటలు యిష్టం ఉండవు!" ఆంజనేయ దండకం మధ్యలో ఆపితే మళ్లీ స్వామికి కోపం వస్తుందేమో అన్న భయంతో

అన్నాడు కామేశం.

"కవి అన్నాక అన్ని రకాలూ రాయాలి కదండీ మరి. కవిత్వం రాస్తానంటిరి గదా! అమ్మాయిల మీద రాస్తారా!"

"ఊహు రాయను. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అన్యాయాల మీద, అక్రమాల మీద వ్రాస్తాను."

"దానివల్ల ఎవరికి లాభం?"

"అందరికీ లాభం!"

"ఎలా? లంచంలేందే దేశంలో పనే జర గదు. మీరు మీ కవిత్వంతో దారి సూపగలరా? ఆడదాన్ని మగాడు ఎన్నోఇధాలుగా అన్నాయం సేత్తున్నాడు. మీరు మీ కవిత్వంతో పరిస్కారం సూపించగలరా! మీరు సూపించారనే అనుకుం దాం... దాన్ని సదివి బాగుపడే వోడు ఎవడేనా ఉన్నాడా? ఎందుకూ పనికిరాని కవిత్వం రాసే కన్నా అందరూ సదివో, పాడుకునో సంతోషపడే కవిత్వం రాయొచ్చు కదండీ! ఏటో! సదూకు న్నారు! పైగా మీరెందుకు రాత్తారో మీకే తెల్వ దు" అన్నాడు డ్రైవింగ్ మీద దృష్టి సారిస్తూ.

ఒక్క క్షణం ఆ మాటలతో ఆంజనేయదండ కం చదవడమే మర్చిపోయాడు కామేశం. సరిగ్గా తాను హాజరై వస్తున్న సభావేదిక మీద కూడా ఒక పత్రికాధిపతి ఇదే విషయాన్ని ఎత్తి సూటిగా ప్రశ్నించాడు. "ఈవేళ పుంఖాను పుంఖాలుగా ఎందరో కవిత్వం రాస్తున్నారు. వాళ్లు ఎందుకు రాస్తున్నారు? తమ కవిత్వంతో ఎవరిని ప్రభావితం చేస్తున్నారు? ఎందరిని చైతన్యమూర్తుల్ని చేస్తున్నారు? దయచేసి వ్రాస్తు న్న కవులు అందరూ ఈ ప్రశ్నను తమకు తాము గా వేసుకుని, ఇక మీదట కవిత్వం రాయమని విజ్ఞప్తి చేస్తున్నాను."

లారీ ఒక్క కుదుపుతో ఓవర్ బ్రిడ్జి మీద ఆగడంతో ముందుకు తూలి వెనక్కు జరిగిన కామేశం ఏం చేయాలో తోచక "పట్టుకోసం నిద్రపోతున్న శాల్తీని గట్టిగా పట్టుకున్నాడు. అంతలో సద్దుకుని, లారీ డ్రైవరుకి డబ్బులిచ్చి దిగిపోతూ అన్నాడు "నువు చాలా తెలివైనవాడి వయ్యా!".

"ఉన్నోళ్లంతా ఎదవలైతే మనకెదురేంటీ అంట!" గుండమ్మకథలో ఎన్టీఆర్ డైలాగులాంటి చూపు చూసి నవ్వాడు.

కామేశం దిగడం చూసి క్లీనర్ టక్కున లేచికూర్చున్నాడు.

"ఆయన ఎవరనుకున్నావ్?" అన్నాడు డ్రైవర్‌తో.

"నాకేం తెల్సెహె!" విసుక్కున్నాడు డ్రైవర్.

"మా గురువుగారు. లెక్కలు సాలా బాగా సెప్తారు. మనమే సెడు తిరుగుళ్లు తిరిగి సదువు సెడదొబ్బుకున్నాం. లెక్కల పరీక్షేపోయింది. కనిపించినప్పుడల్లా "పరీక్ష కట్టి పాసయిపోరా సన్నాసీ! మీ అమ్మ కనిపించినపుడల్లా కళ్ల నీళ్లె ట్టుకుంటాది. నువు వినిపించుకు తగలడవు!" అని కేకలేస్తా ఉంటారు.

"మరి నమస్కారం పెట్టచ్చు గదరా ఎద వా!" టెంకి మీద ఒక్కట్టిచ్చాడు డ్రైవర్.

"మళ్లీ కేకలేస్తారని భయం. పదపద! పోనీ" అని తొందర చేసాడు క్లీనరు. క్రిందకు దిగి మంకీ కాప్ పెట్టుకుని, శాలువా ఒంటికి చుట్టు కుంటున్న కామేశం అంతా విన్నాడు.

"ఓరి గణపతిగా! నువ్వా? సినిమాల ప్రభా వంరా! గురువు గారిని గౌరవించే సంస్కారాన్ని మీలో చంపేస్తున్నాయిరా అవి! మీరు వాటిని పట్టుకునే తగలడిపోతారు. అందుకే మీ బ్రతు కులు ఎదగవు! హు!" అనుకుంటూ ఓవర్ బ్రిడ్జి మీదగా నడక ప్రారంభించాడు.

అపుడే ట్రైనింగ్ పూర్తిచేసుకుని డ్యూటీలో చేరిన సైనికుల్లా తమ కాంతి విన్యాసాన్ని ప్రదర్శి స్తున్నాయి మెర్క్యురీ దీపాలు - ఓవర్ బ్రిడ్జిమీద.

సరిగ్గా ఓవర్ బ్రిడ్జి మీదకు వచ్చేసరికి ఎదు రుగా వస్తున్న ఓ నవ యువకుడు "అరె! కామే శం మాష్టారూ! సార్! సార్! బాగున్నారా సార్? ఎలా ఉండేవారు ఎలా అయిపోయారు సార్?" అన్నాడు కళ్లనీళ్లు పెట్టుకుని, చేతులు కట్టుకుని.

తనను కరెక్ట్‌గానే గుర్తు పట్టిన ఆ శాల్తీ ఎవరో గుర్తుకు రాలేదు కామేశానికి. అయోమ యంగా చూస్తూనే "ఎలా అయిపోయానయ్యా! నేను బాగానే ఉన్నానే!" అన్నాడు - ఒంటి కాలిపై బరువంతా ఆనించి రెండో కాలు వూపు తూ నిలబడి.

"ఏం బాగుసార్! జుట్టు రెండు చెంపలా నెరిసిపోయింది. సన్నగా రివటలా ఉండేవారు కాస్తంత ఒళ్లు చేసేరేమో! కానీ మిమ్మల్ని చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది సార్! ఎలా ఉండేవారు ఎలా అయిపోయారు?" అంటూ కళ్లు తుడుచుకున్నాడు ఆ కుర్రాడు గాద్గదిక స్వరంతో.

"వయసు మీద పడుతోంది నాయనా! ఏం చేయగలం చెప్పు? ఏభైఏళ్లొచ్చాయి!" అన్నాడు కామేశం.

"అంటే మా డాడీ ఏజ్! అయినా యింత యంగ్‌గా, యాక్టివ్‌గా ఎలా కన్పిస్తున్నారు సార్? సరిగ్గా పదిహేనేళ్లయింది సార్ మిమ్మల్ని చూసి. ఎంత బాగా లెక్కలు చెప్పేవారు సార్ మీరు? మీరంటే హడలి చచ్చిపోయేవాళ్లం సార్! 'ఎ ప్లస్ బి హోల్‌స్క్వేర్' సూత్రం చెప్పలేదని అరగంట గోడకుర్చీ వేయించారు సార్. యిప్ప టికీ ఆ సూత్రం మర్చిపోలేదు సార్! ఏ స్క్వేర్ ప్లస్ బీస్క్వేర్ సార్! అప్పటి నుంచీ మీరు కనిపిస్తే ఈ సూత్రం చెప్పేసి మీచేత శభాష్ అనిపించు కోవాలని నా కోరిక సార్! మీరే మా నిజమైన గురువుగారు సార్!" అంటూ మూడుసార్లు వంగి కాళ్లకు నమస్కారం చేసాడు ఆ వ్యక్తి.

పోలికలను బట్టి అతను శిష్యుడని గుర్తుకు వచ్చాడుగానీ, పేరు గుర్తుకురాలేదు కామేశా నికి.

"మీ పేరు పేపర్లో చూసినప్పుడల్లా 'ఈ సారే నన్ను ఏకాంబరం అని పిలిచేవారు' అని మా ఆవిడతో ఎన్నోసార్లు చెప్పాను సార్! నాతో అంటే అన్నావు గానీ ఇంకెప్పుడూ ఎవరితో అనమాక! నీకెటూ పరువులేదు. ఆయన పరువు కూడా తీస్తావెందుకు అని మా ఆవిడ నన్ను గదమాయించింది సార్!" బడబడా వాగేస్తు న్నాడు వాడు.

"చక్కటి మాట అంది" అని మనసులో అనుకుని "అది సరే! పెళ్లి చేసుకున్నావన్నమాట! మరి ఉన్న వూళ్లోనే ఉండి నన్ను పెళ్లికి పిలవ లేదేమోయ్! యింతకీ అమ్మాయిది ఏ వూరు? ఏం చేస్తోంది?" పెద్దరికంగా అడిగాడు కామే శం.

వాడు చేతుల్లో మొహం దాచుకుని బావురు మన్నాడు.

కామేశం కంగారు పడిపోయాడు.

యిపుడు ఏ పోలీసయినా చూసాడంటే వాడి దగ్గర ఏ డబ్బో లాక్కుని చిన్న పిల్లాడినిచేసి ఏడిపిస్తున్నాడనుకొని పట్టుకుంటే తన పరువు?

యిక వేరే గతిలేక వాడిని నిలువెల్లా పొదివి పట్టుకుని ఓదార్చాడు.

"సరే లేరా నాన్నా! నన్ను పెళ్లికి పిలవనం దుకు ఏమీ అనుకోనులే! వూరుకో. ఇది రోడ్డు. అలా ఏడిస్తే నిన్ను నేను ఏమైనా చేస్తున్నానను కుంటారు!" అన్నాడు. వాడు తలెత్తి చొక్కాపైకి లాక్కుని దాని కొసతో కళ్లు తుడుచుకున్నాడు.

"అందుకోసం కాదు సార్ నేను ఏడ్చింది. దాన్ని పువ్వుల్లో పెట్టి చూసుకున్నా సార్! ఏది కావాలంటే అది కొనిచ్చాను. నాతో చెప్పాపెట్ట కుండా నా బట్టల షాపులో సేల్స్ బాయ్‌తో లేచిపోయింది సార్! అప్పటి నుంచి యిది ఎక్కు వైంది!" అన్నాడు బొటన వేలుతో మందు సిగ్నల్ చూపుతూ.

అప్పటికి గానీ అర్థం కాలేదు అదంతా మందు ప్రభావమేనని. 'నీకు అన్నీ ఎక్కువయ్యే అది లేచిపోయిందిరా నాన్నా!' అని మనసులో అనుకుని "అయ్యో పాపం! ఎంత అన్యాయం జరిగింది నీకు... సరే వస్తానోయ్! యిప్పటికే చాలా లేటయింది" అని కదలబోయాడు కామే శం.

అనకొండలా చుట్టేసాడు ఏకాంబరం కామే శాన్ని.

"యింత కాలానికి కనిపించారు. పది నిమి షాలు కూడా మాట్లాడకుండా వెళ్ళిపోతారా సారూ!" అంటూ లేచి నిలబడ్డాడు.

చెమట పట్టిన పైజామా లాల్చీ జేబులోంచి నోట్ల దొంతర తీసి చేత్తో పట్టుకుని చూపిస్తూ అన్నాడు."చూడండి సార్! రోజూ యింతలా సంపాదించి పెడుతున్నా యీనాటి ఆడదానికి సంతృప్తి, సంతోషం లేవు సార్! పోతేపోయింది లెండి సార్! డైలీ కలక్షన్ కట్టడానికి వంద తక్కువైంది! యిది పట్టుకెళ్లి కట్టకపోతే మా యజమాని సంపేస్తాడు సార్! ఓ వంద ఉంటే సర్దండి సార్!" అన్నాడు ఏకాంబరం.

"వూరు నుంచి వస్తున్నవాడిని డబ్బులుంటే రిక్షామీదే యింటికి పోదునుకదయ్యా!" అన్నాడు కామేశం తప్పించుకునే ఉద్దేశంతో.

"మీరు అట్టానే అంటారు సార్! మీరు, మీ ప్లానింగ్ నాకు తెల్వదా. యిచ్చెయ్యండి సార్! ప్లీజ్ యిచ్చెయ్యండి సార్!" ఆల్కహాల్ స్మెల్‌తో మీదమీదకు యించుమించు దాడి చేస్తున్నట్టు వస్తున్న వాడి సువాసన భరించలేక కామేశం జేబులోంచి వంద తీసి వాడి చేతుల్లో పెట్టాడు.

"చూసారా! యిందాక లేవన్నారు? పిల్లల దగ్గర గురువుగారు అబద్దాలు సెప్పచ్చా! థ్యాం క్స్ గురువుగారూ. ఓ పాలు అడ్రసు తెలుసుకుని తమ యింటికి వస్తాలెండి. మీకు ఎప్పటికైనా సన్మానం చేసుకోవాలని నా కోరిక! ఉంటాను గురువుగారూ. థ్యాంక్స్ గురువుగారూ. మా గురువుగారెంత మంచారో!" అంటూ పాదాభి వందనం చేసి, చేతులు తీసుకుని కళ్లకద్దుకుని చివరగా ఏమనుకున్నాడో ఏంటోగాని, గట్టిగా వాటేసుకుని బుగ్గను ముద్దెట్టుకుని బై గురువు గారూ!" అంటూ వెళ్లి వందగజాల దూరంలో ఆపి రెడీగా ఉన్న బైక్ మీద ఉన్న మనిషి వెనక కూర్చున్నాడు ఏకాంబరం.

"పదరా! గురువుగారి పేరు చెప్పుకుని ఫుల్ ఏసేద్దాం. మళ్లీ షాపు కట్టేత్తారు. థాంక్స్ గురు గారూ బై!" అనగానే బైక్ ముందుకు దూసుకు పోయింది.

కామేశం మ్రాన్పడిపోయాడు.

"ఓరి నీ బండబడా! యిది నీ తాగుడు కోసమా? పైగా నాకు సన్మానం చేస్తావా! యిపు దు సన్మానించావుకదరా! అక్కడ లారీలో వాడు ... ఆ గణపతి గాడు... యిక్కడ యిపుడు నువ్వు... చేసారు కదరా సన్మానం. ఇన్ని వేల మంది శిష్యులకు చదువు చెప్పానే గానీ యిలా ఎవరూ సన్మానం చెయ్యలేదురా నాయనా!

యిక్కడే వుంటే ఆ'వంద' తాగేసి, మళ్లీ యింకో వందకోసం వచ్చినా వస్తాడు! అమ్మో!" అనుకుంటూ అంగకు రెండు అంగలు బోనస్ గా వేసుకుంటూ యింటిదారి పట్టాడు కామే శం!!!